**ఆరోగ్యం కోసమే అయినా చేదుమాత్ర మింగడం అంటే కష్టమే!**

"అదీ కథ!" అని ముగించాను.

ముందు చిన్న చిరునవ్వు నవ్వేడు విశ్వపతి. తర్వాత దాన్నే బాగాపెద్దదిగా విస్తరింపజేశాడు.

నాకు కోపం వచ్చినమాట నిజమే. కాని తమాయించుకున్నాను. ఈ పెద్దమనిషి ఇలా తన టిపికల్లీ స్పెషలైజ్డ్ ఎండ్ కేరెక్టరిస్టిక్ నవ్వు నవ్వక మానడని తెలుసు. అయినా తప్పలేదు.

# ఇదో తిరుగుబాటు కథ

చిట్టిరాజు తిరుగుబాటు నాకు ఓ చిన్న ప్రాబ్లెం అయింది. చిన్నదైనా, పెద్దదైనా ప్రాబ్లెం ప్రాబ్లెమే। ప్రతి ప్రాబ్లెంకీ రెడీ రికనర్ విశ్వపతి కనక నాకు తప్పలేదు. అవసరం నాది. సమాధానం నాక్కావాలి. అతన్దగ్గరుంది। ఊరికేనే ఎవరూ ఏదీ ఇవ్వరు.

'ఓరి చెవలాయ్।' అన్నట్లుగా ఓ చిన్న నవ్వు నవ్వి, కృష్ణుడి పోజు పెట్టి. నా చెవిలో పువ్వెట్టడం అతనికి సరదా। పెట్టించుకోవడమే నేను చెల్లించవలసిన మూల్యం.

"ఇది ఇంకో బెబ్బే కథ. పాతదే। బాటిల్ కూడా పాతదే। లేబిల్ మాత్రం కొంచెం మారింది।" అన్నాడు విశ్వపతి.

"కోడ్ లాంగ్వేజొదిలెయ్। సూటిగా చెప్పు।" చిరాకు పడ్డాను.

"కోడ్ లాంగ్వేజేం కాదు. నీకు బెబ్బే కథ తెలీదా? బోన్లో నుంచోబెట్టి ఎదుట లాయరు ఏ ప్రశ్న వేసినా, దానికి 'బెబ్బే।' అని జవాబిచ్చిమని, నీలాంటి లాయరొకడు చిట్టిరాజులాంటి క్లయింట్‌కి అమూల్యమైన సలహా ఒకటిచ్చేడు. అలా అయితే అమాయకుడనుకునో, మూగాడనుకునో, పిచ్చాడనుకునో, కోర్టువారు కేసు కొట్టేస్తారని కూడా చెప్పేడు. అలాగే అయింది కూడా! ఎటొచ్చీ ఫీజిమ్మని అడిగినప్పుడు చిట్టిరాజు, కిరీటికి బెబ్బే చెప్పేడు।।" ఆగేడు విశ్వపతి.

"నాన్సెన్స్। నాన్సెన్స్। నేను చిట్టిరాజుని ఫీజిమ్మందవేమిటి?"

"శిష్యుడివి కమ్మని డిమాండ్ చెయ్యడం, ఫీజిమ్మనడం లాంటిదే।"

"నాతో శిష్యరికం చెయ్యమని నేనేం చెప్పలేదే అతన్తో?"

"నోటితో చెప్పలేదనుకో। జస్ట్ ఎక్స్‌ప్లాయిట్ చేశావు అతన్ని-అంతే।"

"ఇటీజ్ టూమచ్ పతీ। నువ్వు నన్ను ఘోరంగా అవమానిస్తున్నావు...." కోపంతో ఊగిపోయాను.

చిరునవ్వుని అలాగే అట్టేపెట్టుకుని, టాపిక్ మార్చేడు విశ్వపతి.

దాదాపు అరగంటతర్వాత, సుహృద్భావ వాతావరణంలో చర్చలు కొనసాగేయి.

జవాబు చెప్పేడు ఆఖర్న। స్వీట్‌గా అయినా, స్పష్టంగా। చెప్పడం స్వీట్‌గానే చెప్పేడుగాని, ఆ జవాబు- వచ్చినిజంగనక చేదుగా ఉంది।

* * *

అది అయిదోసారి భాస్కర్రావు చిట్టిరాజు దగ్గర అప్పుచ్చుకోవడం.

నాకు ఒంటికి కారం రాసుకున్నట్లైంది. భాస్కర్రావు అంటే నాకు విపరీతమైన ఒళ్ళుమంట।

వ్యవహరించడానికైతే, 'అప్పుచ్చుకోవడం' అని అనాలిగాని, భాస్కర్రావు ఎవరిదగ్గరా అప్పుచ్చుకోడు। ఎగరేసుకుపోతాడంతే। తిరిగిచ్చే ప్రసక్తే లేదు।





ఆ ప్రత్యేకమైన అర్థంలో 'అప్పారావు' కూడా తనముందు బలాదూరే అన్నంత ధీమా ఒకటి మనిషిలో! 'ఎంతటివాణ్ణయినా, ఇట్టే వెర్రి వెధవనిచేసి లాగిగలను తెలుసా?' అన్నట్లు ఓ వంకర నవ్వోటి నవ్వుతాడు నావైపు. ఆ నవ్వులో 'నిన్ను మాత్రం ఎన్నిసార్లు వెర్రి వెధవని చెయ్యలేదు?' అన్న భావం ఒకటి నన్ను పొడుస్తూ ఉంటుంది.

ఆఫీసులో మా ఏ. ఓ. [ఎకౌంట్స్ ఆఫీసర్] మొదలుకుని, వాచ్ మేన్ దాకా అందరూ మోర్ దేన్ త్రీ టైమ్స్ భాస్కర్రావు ట్రిక్కుల్లో పడ్డారు. నేనూ నాలుగైదుసార్లు అతని కార్డ్సులో తురుపుగా ఉపయోగపడ్డాను.

అందరూ 'మనకెందుకులే! పోనిస్తూ!' ఫక్కీలో ఊరుకున్నారు గాని నేను వదల్లేదు. వాళ్ళందరికీ ఫక్తు పిరికితనం అని నా విశ్వాసం. నాకు పిరికితనం బెరుకుతనం లేవు, ముక్కు సూటి మనిషినినేను. డబ్బైతే రాబట్టుకోలేక పోయానుగాని, ఓ మంచిరోజు చూసి, భాస్కర్రావుని పదిమందిముందూ ఛెడామడా చెరిగేశాను. నిజం చెప్పొద్దూ, అనుకోకుండానే కొంచెం కాలరు పైకి సర్దుకున్నాను.

అదిగో అప్పట్నుంచి, నన్ను అప్పయితే అడగడుగాని ఆ నవ్వోటి మాత్రం నావైపు విసురుతుంటాడు.

నేను చెరిగిడంవైతే చెరిగేసేనుగాని, చరిత్రేమీ మలుపు తిరిగినట్లు కనబడలేదు.

అతను తన కళాకౌశలాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నాడు విజయవంతంగా, నిరాఘాటంగా. నా ఎదురుగా ఎప్పుడు, ఎవణ్ణి బుట్టలో వేసుకున్నా, నా మొహం మీదకి మాత్రం ఆ వంకర నవ్వు బాణాల్ని రువ్వుతాడు. అవి నాకు కారంగా తగుల్తాయి!

అయిదోసారి చిట్టిరాజుని అల్లాటప్పాని చేసి, నన్ను నవ్వుతో వెక్కిరించి వెళ్ళిపోయాడు భాస్కర్రావు.

నేను చిరాగ్గా లేచి, సీరియస్‌గా ముఖం పెట్టుకుని చిట్టిరాజు దగ్గరకి వెళ్ళి.

"రాజూ! అలా కేంటీన్‌కి వెళ్ళొద్దాం వాస్తావుటోయ్?...." అని పిలిచాను.

నావైపు చూసి అన్నాడు చిట్టిరాజు, "ఏమైనా పనుందాసార్?" అని.

"పనంటే.... ఏంలేదోయ్! జస్ట్ నీతో కొద్దిగా మాట్లాడాలి.... అప్పడగడానికి మాత్రం కాదులే!...." ఓ వెర్రి నవ్వులాంటిది కదిలింది నా పెదవులమీద!

"భలేవారు సార్! అడిగితే మాత్రం తప్పేముంది? పదండి!" చాలా నిర్మలంగా నవ్వుతూ అన్నాడు చిట్టిరాజు. అతని నవ్వులోని నైర్మల్యం, నాకు భాస్కర్రావుమీద మంటనీ, అతనిమీద జాలి, ప్రేమ, అభిమానం, వాత్సల్యం లాంటి భావాల్నీ కలిగించింది.

"రాజూ! నువ్వు నా తమ్ముళ్ళాంటి

వాడివి! నీమీద ప్రత్యేకమైన అభిమానం ఉంది నాకు! జస్ట్ ఓ కొల్లీగ్‌లా మాత్రమే నిన్ను చూడటం లేదు నేను. ఆ సంగతి నీకూ తెలుసు! ఏమంటావ్?"

ఏమంటాడు! ఈ ఉపోద్ఘాతం ఎందుకో అతనికి సరిగ్గా అర్థం కాలేదు

ఈ ఉపోద్ఘాతంలో కొంత నిజం లేకపోలేదు. చిట్టిరాజు ఈమధ్యనే కొత్తగా ఎప్పాయింటయ్యాడు. పంధొమ్మిది ఇరవై యేళ్ళుంటాయి. సర్వీసులోనూ, వయస్సులోనూ కూడా పదేళ్ళు పెద్దవాణ్ణి అతనికన్నా.

అతనికి ఎలాట్ చేసిన సీటులోని వర్క్ గురించి నేనే ట్రెయినింగ్ యిచ్చాను.

ఆ తర్వాత అతనికి మా యింటికి దగ్గరలో ఒక రూం కూడా అద్దెకిప్పించాను.

నేనంటే అతను చాలా గౌరవభావంతో ప్రవర్తిస్తాడు. నేనూ, రోజుకోసారైనా అతని మంచిచెడ్డలు కనుక్కుంటుంటాను

పరిచయంలో ఎప్పుడో నేను నాకు తెలియకుండానే ఏకవచనంలోకి దిగిపోయాను. ఏం అనుకోలేదు అతను.

చిట్టిరాజు కొంచెం మెతకమనిషి! ఎవర్నీ కాదనలేడు. ఏ విషయంమీదా గట్టిగా మాట్లాడలేడు. తనకి ఇష్టంలేని విషయాన్ని గట్టిగా తిరస్కరించలేడు. బాగా మొహమాటస్థుడు!

అది అలుసుగా తీసుకుని మా హెడ్ క్లర్క్, అతనికి అయినవీ, కానివీ అన్ని పన్లూ అంటగట్టి అరవచాకిరీ చేయించుకుంటూ వుంటాడు

దానికి సాయం అతను చూసేది ప్రావిడెంట్ ఫండ్ సీటు. ప్రతీవాడు రావడం తన లోన్ అప్లికేషన్ సంగతి చూడమని, బతిమాలడం, ఇతను ప్రతివాణ్ణీ ఒబ్లైజ్ చెయ్యడం, ఏ.ఓ. చేత చివాట్లు తినడం. పెండింగ్ లేకుండా చూసుకోవడం కోసం చిట్టిరాజు గొడ్డులా పనిచేస్తూ, రాత్రి ఏడూ ఎనిమిది దాకా ఆఫీసులోనే వుండిపోతూ ఉంటాడు. అది చాలదన్నట్లు రూంకి కూడా ఆ రికార్డంతా తెచ్చుకుని పని చేస్తాడు.

చూచూసి, ఓరోజు చిట్టిరాజుని దగ్గర కూర్చోబెట్టుకుని, ఓ గంట బోధపరిచేను.

"మంచితనం మరీ ఇంత పనికిరాదు రాజూ! పోనీ గుర్తింపైనా ఉంటుందా అంటే, పని చేయించుకుని, నిన్ను వెర్రి వెధవని చూసినట్టు చూస్తారు. కొంచెం గడుసుతనంగా ఉండాలి...." అని....

ఉపోద్ఘాతానికి జవాబు నాశిస్తూ చూశాను చిట్టిరాజు కేసి

"....ఎంతమాటండీ! మీ అభిమానం నాకు తెలియందా?" అన్నాడు రాజు.

"అవునా? ఎవడెలా పోతే నాకేం అన్న పద్ధతిలో నీ గురించి అనుకోలేకపోతున్నాను. నువ్వీ విధంగా భాస్కర్రావు వల్లో పడ్డం నాకు నచ్చడం లేదు...."

"వల్లో పడ్డం ఏముందండీ! ఏదో అవసరాని కడిగారు ఆయనే ఇచ్చేస్తారు. నా దగ్గరుంది గనక యిచ్చాను. లేకుంటే యివ్వలేను కదా"

"నీ కెప్పుడు లోకం అర్థం అవుతుందో నాకు తెలీడం లేదోయ్! మెత్తగా ఉంటే నెత్తెక్కి తొక్కుతుంది లోకం. అతను యివ్వడనీ నీకు తెలుసు ఇది మొదటిసారి కాదనీ నీకు తెలుసు...."

"ఏం చెయ్యమంటారండీ! మనిషంత మనిషికి లేదు పొమ్మని అబద్ధం చెప్పమంటారా....?"

"చెప్పాలయ్యా! ముల్లు దగ్గర ముల్లు లాగే వ్యవహరించాలి! మొహమాటానికి పోతే ఏదో వస్తుంది. చివరకు భ్రష్టుడివై పోతావ్!"

ఏం మాట్లాడలేదు రాజు.

* * *

ఈ మధ్య నాతో చనువుగా ఉండటం తగ్గించాడు చిట్టిరాజు. కారణం బోధపళ్ళేదు నాకు. పలకరిస్తే ముభావంగా జవాబు చెప్పి తప్పుకుపోతున్నాడు.

మొన్నామధ్య ఒకసారి, మా పాపను హాస్పిటల్లో జాయిన్ చెయ్యవలసివచ్చినప్పుడు, అర్జంటుగా జి.పి.ఎఫ్. లోన్ కావలసివచ్చింది.

అప్లికేషన్ పెట్టి, సంగతిచెప్పి, రాజుని బతిమాలేను తొందరగా చెయ్యమని.

"సారీ సార్! పెండింగ్ ఎక్కువగా ఉంది. ఏ.వో. గారు ఆఫీసార్డర్ వేశారు. సీరియల్ ఆర్డర్ దాటవద్దని. ఏమనుకోకండి ప్లీజ్! ఏ.వో. గారిచేత స్లిప్ రాయించుకు రండి" అన్నాడు చిట్టిరాజు.

నిజమే అనుకున్నాను. కొంచెం సంతోషించేను కూడా, కనీసం ఈ పాటైనా చెప్ప గలుగుతున్నాడని.

ఏ.ఓ. గారి దగ్గరకు వెళ్ళి స్లిప్ రాయించుకొచ్చేను. ఏ.వో. గారు రాసిచ్చేరు నా మొర విని.

సాయంత్రందాకా శాంక్షను రాలేదు. సంగతేమిటో కనుక్కునేందుకు వెళ్ళాను. ప్యూన్ చెప్పాడు.

చిట్టిరాజు స్లిప్ ఆధారంగా నా అప్లికేషన్ పుటప్ చెయ్యనే లేదట. ఆ స్లిప్‌ని జనరల్ ఫైల్లో వేసి. "పెండింగ్ చాలా వుంది. ఈ అప్లికేషన్ ఈరోజే వచ్చింది. నూటయాభై అప్లికేషన్లు దాటించి పుటప్ చెయ్యమంటారా?" అని నోట్ రాసి. మళ్ళీ ఏ.ఓ.కి పంపించాట్ట! ఆ సరికి ఏ.ఓ. గారు ఏదో మీటింగ్‌కి వెళ్ళిపోయారు.


ఆ రోజుకి రాలేదు నాకు లోన్. మర్నాటిదాకా రాలేదు. అయితే నాకు ఒక విషయం అయోమయం అనిపించింది, 'ఇంత చిన్న విషయాన్ని చిట్టిరాజు ఎందుకింత సాగదీశాడు?' అని.

అయితే మర్నాడు నా అప్లికేషన్‌తో బాటు వెంకట్రావు కూడా లోన్ తీసుకుంటూ ఉంటే అడిగాను. తనెప్పుడు అప్లయి చేశాడని. ఆరోజే అంతకు అరగంట ముందే అని చెప్పాడు వెంకట్రావు. పైగా అతను ఏ.ఓ. గారి దాకా వెళ్ళనే లేదట. చిట్టిరాజు దగ్గరే పనయిపోయిందట.

* * *

"రాజూ!" పిలిచాను.

తలెత్తి చూశాడు.



"నా మెడికల్ బిల్లు రేపు వస్తుంది. ఈ రోజే శాంక్షన్ అయిపోయిందిగాని. కేషియర్ టైమైపోయింది రేపు రమ్మ న్నాడు. పాపకి అర్జంటుగా పాలడబ్బా కొనాలి. ఓ పాతిక ఉంటే సర్దుతావా?...." ఎందుకో, నా మాటల్లో నాకే తెలియకుండా ఓ మొహ్తరు ఇబ్బంది. మొహమాటం, బెరుకు ధ్వనించాయి!

"సారీ సార్! అయాం రియల్లీ వెరీ సారీ! ఉంటే ఇచ్చేవాణ్ని...." అంటూ నాకేసి చూడకుండా వెళ్ళిపోయాడు.

అంతకు గంటముందే చిట్టిరాజు ఫెస్టి వల్ ఎడ్వాన్స్ తీసుకున్నట్లు నాతో చెప్పేడు కేషియర్ రంగారావు.

"రేపిస్తాను గురూగారూ! అందాకా మీ శిష్యుడు చిట్టిరాజు దగ్గర తీసుకోండి! జస్ట్ గంటైంది అతను ఎఫ్.ఏ. తీసుకుని" రంగారావు మాటలు నా చెవిలో గింగురు మంటున్నాయి!

ఏమీ తోచక. మరెవర్నిధుగాలా అని ఆలోచిస్తూ కేంటీన్ వైపు నడుస్తున్నాను.

దూరంనుంచి. భాస్కర్రావు చిట్టి రాజుతో మాట్లాడుతుండటం కనిపించింది.

నేను నాలుగడుగులు ముందుకు వేసే సరికి, భాస్కర్రావు నాకేసి వస్తున్నాడు. చేతిలోని నోట్లు జేబులో పెట్టుకుంటూ, నావైపు చూసి ఓ వంకర నవ్వు నవ్వేడు!

నాకు అర్థమైంది ఒకటి!

అర్థం కానిది మరొకటి!

* * *

"....చిట్టిరాజు నాతో యిలా ఎందుకు ప్రవర్తిస్తున్నాడో అర్థంకాలేదు!

నేనేమైనాచేస్తే అతనికి ఉపకారమే చేసేనుగాని. ఏమీ అపకారం చెయ్యలేదు గదా?

పోనీ, నేను చెప్పిన హితవు బాగా జీర్ణించుకుని లోకంమీద. అవకాశవాదం మీద,ఎక్స్‌ప్లాయిటేషన్‌మీద తిరుగుబాటు చేస్తున్నాడా అంటే అదీ లేదు! అలా అయినా నిజంగా సంతోషించేవాణ్ణి.

అతన్ని హెడ్‌క్లర్క్ ఇప్పటికీ అలాగే ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్నాడు. అతన్ని కొలీగ్స్ అందరూ ఇప్పటికీ అలాగే ఒత్తిడిచేసి పనులు జరిపించు కుంటున్నారు. అతనుఇప్పటికీఅలాగేఅరవ చాకిరీచేస్తున్నాడు. అతను ఇప్పటికీఅలాగే రాత్రి ఏడు ఎనిమిది దాకా ఆఫీసులో పని చేస్తున్నాడు. అతను ఇప్పటికీ అలాగే రూంకి రికార్డు తెచ్చుకుని పనిచేస్తున్నాడు.

భాస్కరరావు చిట్టిరాజు దగ్గర ఇప్ప టికీ అలాగే డబ్బు 'అప్పుచ్చు'కుంటు న్నాడు!!

"మరి ఏమార్పు అతనిలో వచ్చినట్లు? ఏ మార్పూ రాకపోతే అద్దేపాయె! మధ్యలో నా మీద ఈవిధంగా చిట్టిరాజు తిరుగుబాటు ధోరణి కక్ష సాధింపునర్నీ ఇవన్నీ ఎందుకు ప్రదర్శిస్తున్నట్లు? ఇదీ సమస్య! అదీ కథ!" అని. విశ్వపతితో చెప్పి ముగించాను.

చాలా సేపటికి. సజావుగా జవాబు చెప్పేడు విశ్వపతి!

"ఎక్స్‌ప్లాయిటేషన్స్ అనేక విధాలు. అందులో స్పిరిట్యువల్ ఎక్స్‌ప్లాయి టేషన్ అనేది ఒకటి!

నువ్వు చిట్టిరాజు ఆత్మ అహంకారం. వ్యక్తిత్వం వగైరా రూప నామాంతరా లతో వ్యవహరించబడే 'ఇగో' మీద సవారి అయిపోయేవు!

ఎవడైనాసరే తన తాలూకుబలహీనత, అసమర్థత, అమాయకత్వం వగైరా అవ లక్షణాలని ఆయా ఒరిజినల్ పేర్లతో అంగీకరించడానికి యిష్టపడడు. ఎదుటి వాడు, వీడి మంచే కోరనీ. మరింకేంకోరనీ వేలెట్టి చూపించి ఆ పేర్లన్నీ వల్లిస్తే అసలు భరించలేడు!

'ఓరి చెవలాయీ! నీకు తెలీదు. నేను చెబుతున్నాను నేర్చుకో. అదలాక్కాదు. ఇదిలాగ' అని చిట్టిరాజుకి 'బోధ' చేస్తూ నీకు నువ్వు గురుత్వాన్ని ఆపాదించు కున్నావు.

మిగిలినవాళ్ళంతరూ. చిట్టిరాజుకి గొప్పతనాన్ని అంటగట్టి, అతని అవ లక్షణాలన్నిటికీ గ్రేట్‌నెస్‌ని పూతపూసి. అతనిముందు చేతులు నలుపుకుంటూ నిల బడి, నసిగి, అతనికి శిష్యపరమాణువుల్లా నటించి. నిలబడగలుగుతున్నారు.

ఇవేవీ అతనికి తెలియని విషయాలను కోకు నువ్వు! అన్నీ తెలుసు! అయితే ఎటొచ్చీ తన బలహీనతల్ని తనే ఎప్ప టికో అప్పటికి ఎలాగోలా జయించుకుం టాడు. నీతో పాఠాలు చెప్పించుకుందికి సిద్ధంగా ఉండడు!


నిప్పుని పట్టుకోనీ పసివాణ్ణి! ఆ తర్వాత పట్టుకోవడం మానేస్తాడు. వాణ్ని వదల కుండా గట్టిగా పట్టుకుని చూడు! చెయ్యి కొరికి బైట పడతాడు!

'పతితుడా! భ్రష్టుడా! బాధా సర్ప దష్టుడా!' అని జాలిపడుతూ వాణ్ని రగి లించలేవు'

'ఓహో వీర యువకా! శూర ఎలకా!' అని పాడి వాణ్ని గెంతించగలవు.

బోధపడిందా?"

## బిందు బంధువులు



ఆకాశం పరిశ్రమించి
అనూనంగా కార్చిన చెమట
బిందువులు
అన్నార్తుల పాలిటి ఆప్తబంధువులు.

పి. ఎల్. శ్రీనివాసరెడ్డి

